నిర్లక్ష్యం.. పేదల పాలిట శాపం

- స్వార్థపూరిత ప్రయోజనం.. పేద జీవితాలతో చెలగాటం
- దుర్గంధభరిత ప్రదేశంలోనే ఆశ్రయం
- బడిబాట పట్టాల్సిన పిల్లలు ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ
- విమర్శలకు తావిస్తున్న పొన్నూరు మున్సిపాలిటీ తీరు



డంపింగ్ యార్డులో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న పిల్లలు

పొన్నూరు: టన్నుల కొద్దీ చెత్త, వ్యర్థాల గుట్టలతో పొన్నూరు డంపింగ్ యార్డు నిండి ఉంటుంది.. తీవ్రమైన దుర్గంధం వెదజల్లే ఆ ప్రదేశంలో ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా యంత్రాలతో మాత్రమే డంపింగ్ పనులు నిర్వహిస్తుంటారు. ఆ ప్రదేశంలో మానవ సంచారం తక్కువగా ఉంటుంది. రోజు పట్టణంలోని 31 వార్డుల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. అలాంటి ప్రదేశంలో పేదలు కొందరు ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించడం, అందుకు మున్సిపల్ యంత్రాంగం అవకాశం కల్పించడం విమర్శలకు తావిస్తోంది. పేదల ఆరోగ్యానికి రక్షణ కల్పించాల్సిన వారే, పేదల జీవితాలతో చెలగాటమాడటం గమనార్హం.

అధికారుల నిర్లక్ష్యం.. పేదల పాలిట శాపంగా మారింది. స్వార్థపూరిత ప్రయోజనంతో ఎలాంటి వేతనం అందించకుండానే పేద ప్రజలతో డంపింగ్ యార్డును శుభ్రపరిచే పనులు చేయించడం పట్ల ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది పేదలు చెత్త సంపద కేంద్రంలో ప్లాస్టిక్ వస్తువులను సేకరిస్తున్నారు. వారు చేసే పనులను అడ్డుకోవడంలో అధికార యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరించడమే కాకుండా వారి అవసరాన్ని అవకాశంగా మలుచుకుని డంపింగ్ యార్డులోని ప్రాంగణంతో పాటు గదులను ఊడ్చే పనులను అప్పగించినట్లు తెలిసింది. వారితో పాటు పసి పిల్లలు ఉండటంతో వారందరికీ యార్డు ప్రాంగణంలో వరాహాల(పందుల) కోసం నిర్మించిన గదులను కేటాయించారు. దీంతో చిన్నారులను ఆ గదులలోనే నిద్రించేలా పదుల సంఖ్యలో ఊయలలను ఏర్పాటు చేసుకున్నారు. అపరిశుభ్రంగా ఉండి దుర్గంధం వెదజల్లుతూ పందులు సంచరించే ఆ ప్రదేశంలో పాలు తాగే చిన్నారులకు ఆశ్రయం కల్పించటం పట్ల పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా బడికెళ్లాల్సిన పిల్లలు ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్నారు. వారిని బడిబాట పట్టించాల్సిన పొన్నూరు మున్సిపల్ అధికారులు వారి చర్యలను ప్రోత్సహిస్తున్నట్లుగా ఆ దృశ్యాలు నిర్ధారిస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనేక విమర్శలకు తావిస్తుంది. అయితే ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణకు వచ్చిన వారితో డంపింగ్ యార్డు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే పనులు అప్పగించామని, చిన్నారులు నిద్రించేందుకు వరాహాల కోసం ఏర్పాటు చేసిన గదులు కేటాయించామని సిబ్బంది చెప్పడం గమనార్హం.



వరాహాలకు నిర్మించిన గదులలో ఏర్పాటు చేసిన ఊయలలు

గ్రామ స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలి



వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: పార్టీని గ్రామ స్థాయిలో పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి వెనిగండ్ల గ్రామ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచి కొండమడుగుల వెంకటరెడ్డి, వేల్పుల నాగరాజు, కాత్రోత్ సేవియానాయక్, జి.శ్రీనివాసరావు, జి.శంకరరెడ్డి, ఎ.శేషిరెడ్డి, కె.శంకర్, మురళీమోహన్‌రెడ్డి, శివారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ముత్తయ్య, రాజేష్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే చిన్నారులకు పోషకాహారం



మాట్లాడుతున్న సీడీపీవో అరుణ తదితరులు



తల్లిదండ్రులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ ప్రేమలత



తండ్రులకు పోషకాహారంపై వివరిస్తున్న ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీవో విజయనిర్మల

గరికపాడు(కాకుమాను): చిన్నారులకు పోషకాహారం అందించడంలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ పాండ్రపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ప్రేమలత అన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేది నుంచి నిర్వహిస్తున్న పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గరికపాడు అంగన్‌వాడీ సబ్ సెంటర్‌లో శుక్రవారం పోషకాహారంలో పురుషుల భాగస్వామ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమలత మాట్లాడుతూ మహిళలతో పాటు పురుషులు కూడా తక్కువ ఖర్చుతో ఇంటి వద్దనే మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేయడం నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులచే చిన్నారులకు ప్రతి రోజు పోషకాహారం అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాండ్రపాడు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వర్ణభారతినగర్‌లో పోషణ్ మాసోత్సవాలు

గుంటూరు రూరల్: నగర శివారులోని 41వ డివిజన్ స్వర్ణభారతినగర్‌లో శుక్రవారం రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను నిర్వహించారు. స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో అరుణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం దానిని వినియోగించు విధానాలు తెలిపారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు ఏవిధంగా తయారు చేసుకోవాలి వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్మితపద్మజ, సూపర్‌వైజర్ శ్రీదేవి, శైలజ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై తండ్రులు శ్రద్ధ చూపాలి

ప్రత్తిపాడు: పిల్లల ఆరోగ్యంపై తండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అడిషనల్ సీడీపీవో సీహెచ్ విజయనిర్మల అన్నారు. పోషణ్ మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు ముస్లిం ఏరియా సెంటరు, వంగిపురం బీసీ అంగన్‌వాడీ సెంటర్లలో బిడ్డల ఆరోగ్యం ఎదుగుదలలో పురుషుల భాగస్వామ్యం, తండ్రుల బాధ్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పోషణపై తండ్రులతో కమ్యూనిటీ ప్రతిజ్ఞలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ సీడీపీవో విజయనిర్మల మాట్లాడుతూ పిల్లల పెంపకంపై తల్లులతో పాటు తండ్రులు కూడా శ్రద్ధ చూపాలన్నారు. చిన్నారులు జంక్ ఫుడ్ తినకుండా తండ్రులు బాధ్యత తీసుకుంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ కరీమూన్, షేక్ హసీనా, జి.మహాలక్ష్మి, టి.జ్యోతిరాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండాలి




కాకుమాను: ప్రతి విద్యార్థి వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండాలని అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవోలు కె.ఎఫ్.కెన్నడీ, విజయ్ భాస్కర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఎంఈవోల పర్యవేక్షణలో ఏఎన్ఎం సుజాత వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థులు సకాలంలో భోజనం చేయక పోవడం వలన వారిలో రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని ఏఎన్ఎం సుజాత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎత్తు, ఛాతి, హిమోగ్లోబిన్, తల చుట్టుకొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థినులు



వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన ఇరువురు క్రీడాకారిణులు రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బాపట్ల జిల్లా ముత్తాయిపాలెం హైస్కూల్‌లో మూడు రోజుల క్రితం ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-17 బీచ్ వాలీబాల్ పోటీల ఎంపిక జరిగింది. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్ చదువుతున్న వేజండ్ల గ్రామానికి చెందిన పఠాన్ షాహెద, ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ చదువుతున్న మట్టుపల్లి సుమశ్రీ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు వేజండ్ల జెడ్పీ హైస్కూల్‌లో చదువుకుంటూ వాలీబాల్ క్రీడలో శిక్షణ పొందారు. ప్రతిభ కనబరిచిన ఇరువురిని హైస్కూల్ హెచ్ఎం గౌరేశ్వరీదేవి, పీడీ విజయదుర్గ, పీఈటీ వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ పఠాన్ రబియా తదితరులు అభినందించారు.

99 అడుగుల మట్టి మహాగణపతికి 999 కేజీల లడ్డూ



గుంటూరు రూరల్: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మట్టి మహాగణపతిగా కొలువుదీరిన అమరావతి త్రిముఖ నాగ విఘ్నేశ్వరుడు 99 అడుగుల గణనాథుడి నిమజ్జన కార్యక్రమం శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించటం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య కళాశాల గ్రౌండ్‌లో గణపతి మండపం వద్ద కమిటీ సభ్యులు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా పుణ్యనదుల నుంచి తీసుకొచ్చిన నీటితో గ్రౌండ్‌లోనే నిమజ్జనం చేయనున్నామని తెలిపారు. 21 రోజులపాటు పూజలు, హోమాలతో వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం 4 గంటల నుంచి స్వామి వారి లడ్డూ, శ్రీశైల దేవస్థానం వారిచే అలంకరించిన వరి కంకుల మాల వేలం పాట, అనంతరం నిమజ్జన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నగర పరిసర ప్రాంత ప్రజలంతా ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని కమిటీ సెక్రటరీ లక్ష్మారెడ్డి కోరారు. కార్యక్రమంలో కమిటీ ముఖ్య నాయకులు రాజేష్, సాయి, గణేష్, గంటస్వామి, దుర్గారెడ్డి ముద్రగడ, రామాంజనేయరెడ్డి, హేమంత్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

చేబ్రోలు: విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కాకూడదని, మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.ఏడుకొండలు అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో శుక్రవారం ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో పొగాకు రహిత పాఠశాలల ఆవశ్యకత గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. టుబాకో ఉత్పత్తులు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్ వాడకం వలన నష్టాలపై ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీవీ శ్రీనివాస్, ఎస్ ఉమామహేశ్వరి, ఆర్ సురేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

వీవీఐటీయూలో ఎక్సోషియా-2కే25 సదస్సు



సత్యనారాయణకు జ్ఞాపికను అందిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ఎక్సోషియా-2కే25 వేడుకలను ప్రముఖ ఈవీ సంస్థ ఐజెడ్‌బీపీ ఆటోస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఎం.సత్యనారాయణ ప్రసాద్ ప్రారంభించారు. మండలంలోని నంబూరు వీవీఐటీయూలో సర్క్యూట్ కార్నివాల్, వాటి-ఏ-ఫైట్, కోడ్ బ్రేకర్స్, ఎలిమినేటర్స్ ఎరీనా, ప్రాజెక్ట్ ఎక్స్‌పో వంటి సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో తొలిరోజు శుక్రవారం వివిధ సాంకేతిక కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వెహికల్స్, బ్యాటరీ సంబంధిత రంగాలలో యువ ఇంజనీర్లకు మంచి అవకాశాలు ఉన్నాయని, పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్‌బాబు, సంధానకర్త డాక్టర్ సీహెచ్ నాగసాయి కళ్యాణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొన్నూరు: నిడుబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఆర్.వి.శంకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నిడుబ్రోలు, క్యాబిన్‌పేట ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

చలో మెడికల్ కాలేజ్‌కు తరలివెళ్లిన నాయకులు



పొన్నూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన చలో మెడికల్ కళాశాల నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు పొన్నూరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో యువత, విద్యార్థులు పిడుగురాళ్ల తరలివెళ్లారు. పొన్నూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి అమిరినేని సాంబశివరావు, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు చుండూరు వీరయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, పార్టీ నాయకులు తరలివెళ్లి నిరసనలో పాల్గొన్నారు.

వీవీఐటీయూలో ప్రీ ప్లేస్‌మెంట్ టాక్



మాట్లాడుతున్న ఏటి అండ్ టీ టాలెంట్ అక్విజిషన్ డైరెక్టర్ పద్మజాశ్రీరామ్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో ప్రముఖ టెలీకమ్యూనికేషన్స్ కంపెనీ ఏటీ అండ్ టీ ల్యాబ్స్ నియామక ప్రక్రియకు ముందు క్యాంపస్‌లో ప్రీ ప్లేస్‌మెంట్ టాక్, ఇంటరాక్షన్ ఇన్ఫర్మేటివ్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీవీఐటీయూలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా ఏటీ అండ్ టీ ల్యాబ్స్ టాలెంట్ అక్విజిషన్ డైరెక్టర్ పద్మజాశ్రీరామ్, సీనియర్ స్పెషలిస్ట్ గోపినాథ్ సంగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్విజిషన్ డైరెక్టర్ పద్మజాశ్రీరామ్ మాట్లాడుతూ వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు తక్షణం అనుసరించగలగాలన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు ఏటీ అండ్ టీ ప్రతినిధులు కెరీర్ అవకాశాలు, కంపెనీ సంస్కృతుల గురించి వివరించారు. కంపెనీ అందించు ఇంటర్న్‌షిప్, ఎంట్రీ లెవల్ స్థానాలను వివరించారు. కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి.రామచంద్రన్, సీఎస్ఎం విభాగాధిపతి డాక్టర్ కె.సురేష్, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణకు వైద్య శిబిరాలు



చేబ్రోలు: మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వేజండ్ల ప్రభుత్వ వైద్యాధికారి కొత్తపల్లి బాబురావు అన్నారు. మండలంలోని శలపాడు గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 77 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆరోగ్య వంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో సమగ్ర ఆరోగ్య సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేసి వైద్య చికిత్సలు అందిస్తామని తెలిపారు. శలపాడు గ్రామ సర్పంచ్ వైద్య శిబిరంను ప్రారంభించారు. మహిళలు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శేకూరు ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి, వేజండ్ల సబ్ సెంటర్ వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: సివిల్ ఇంజనీరింగ్ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాలను ఆవిష్కరించి, వాటిని విద్యార్థులకు చేరవేసే దిశగా అధ్యాపకుల బోధనలో పురోగతి సాధించాలని ఉష్ణా ఇన్ఫినిటీ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ కై జాద్ తెలిపారు. చౌడవరం ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్మార్ట్ మెటీరియల్స్ అండ్ టెక్నాలజీస్ ఫర్ డ్యూరబుల్ స్ట్రక్చర్స్ అనే అంశంపై గత 5 రోజుల నుంచి నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 1,065 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు ముఖ్య అతిథులుగా హాజరై స్మార్ట్ మెటీరియల్స్, నానో టెక్నాలజీ, ఇన్నోవేటివ్ టెక్నాలజీస్, గ్రీన్ కన్‌స్ట్రక్షన్, రీసైకిల్ టెక్నాలజీస్, నిర్మాణంలో ఏఐ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ మానిటరింగ్ టూల్స్ వంటి వివిధ ఆధునిక సివిల్ ఇంజనీరింగ్ రంగంలోని అంశాలపై తమ సందేశం అందించారు. ఈ సందర్భంగా కై జాద్ మాట్లాడుతూ సుస్థిరమైన నిర్మాణాల కోసం స్మార్ట్ మెటీరియల్స్ వినియోగం భవిష్యత్తు అవసరమని, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు పరిశోధన, బోధనలో నాణ్యతను పెంచుతాయన్నారు. అద్భుత నిర్మాణాలే దేశ ప్రగతికి మూలాధారమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు. సుస్థిర నిర్మాణాల కోసం ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అవసరమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ గోపాలకృష్ణ, ట్రెజరర్ కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ప్రసాద్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ సాయిరాం కుమార్, శ్రీకాంత్‌కుమార్, తేజస్విని, వైష్ణవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

కాకుమాను: ఆర్థిక, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారజాత రణభేరి కార్యక్రమం శుక్రవారం పెదనందిపాడు మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఒక్క సమస్య పరిష్కరించకపోగా విద్యా వ్యవస్థను బలహీన పరుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాత్కాలిక నియామకాలే గానీ శాశ్వత నియామకాలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. బదిలీలు, పదోన్నతులు పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయులు పాత స్థానాల్లోనే విధులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుసుమకుమారి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి కళాధర్, పాణిరెడ్డి, దొప్పలపూడి రమేష్‌బాబు, వెంకట శివరావు, రామారావు, రాజేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరిస్తున్నారు

ప్రత్తిపాడు: విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోగా, ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పని జరుగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారానికై యూటీఎఫ్ ఈ నెల 25న విజయవాడలో రణభేరి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేసేందుకు శుక్రవారం యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు బృందం ప్రత్తిపాడులో పర్యటించారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ పిలుపునిచ్చిన 'రణభేరి'కి తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా విద్యా రంగ సమస్యలు పరిష్కరించలేదని తెలిపారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వమే విద్యా వ్యవస్థను బలహీన పరుస్తుందని విమర్శించారు. సాల్ట్ పథకం పేరుతో 3వ వంతు ప్రైమరీ స్కూళ్లు సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారిపోయాయని, సగం పైన హైస్కూళ్లు సింగిల్ సబ్జెక్ట్ స్కూల్స్‌గా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో జరగనున్న రణభేరీకి తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ అధ్యక్షురాలు కుసుమకుమారి, జిల్లా అధ్యక్షుడు వి.రాజశేఖర్, యూటీఎఫ్ నాయకులు కళాధర్, జి.వెంకటేశ్వరరావు, నాగమణి, చంద్రశేఖర్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, షకీలా, వెంకట రెడ్డి, అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఏపీ ఇంక్యుబేటర్స్ మీట్



కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అతిథులు

గుంటూరు రూరల్: ఏపీని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వం ముందున్న లక్ష్యమని, అమరావతి రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆర్‌వీఆర్‌జేసీ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారం అందిస్తూ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయాలని ఏపీ ఐటీ, ఈసీ విభాగ ప్రత్యేక విధుల అధికారి దీప్తి రావుల తెలిపారు. నగర శివారులోని చౌడవరం ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఇంక్యుబేటర్స్ మీట్‌ను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ఇంక్యుబేటర్ కేంద్రాలు, పరిశ్రమల ప్రతినిధులు, విద్యాసంస్థల నిపుణులు, యువ పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. మరికొంతమంది ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. ఆన్‌లైన్ ద్వారా ముఖ్య అతిథిగా పాల్గొన్న దీప్తి రావుల మాట్లాడుతూ యువతలోని సృజనాత్మకతను వాణిజ్యపరమైన ఆవిష్కరణలుగా మలిచి, ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లడంలో ఇంక్యుబేటర్లు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమంలో పలువురు పారిశ్రామికవేత్తలు తమ అనుభవాలను పంచుకుని, స్టార్టప్‌లను ప్రోత్సహించే మార్గాలు సూచించారు. ఇంక్యుబేటర్స్ మీట్‌కు తమ కళాశాల వేదిక కావడం గర్వకారణమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మురళీమోహన్, జగదీష్‌లు తెలిపారు. విద్యార్థులను ఆవిష్కర్తలుగా మార్చడమే ప్రధానమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ గోపాలకృష్ణ, ట్రెజరర్ కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్ రవీంద్ర, ఏవో డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ చంద్రశేఖరరావు, సీఈఓ హఫీజ్‌బాషా, ఇంక్యుబేషన్ మేనేజర్ శోభ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్స్ రిజిస్ట్రేషన్స్ శాఖలో లోపాలను సరిదిద్దాలి



పెదకాకాని: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో సాంకేతిక లోపాలను సరిదిద్ది లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మండల స్టాంప్ రైటర్ల సంఘం అధ్యక్షుడు సుంకర నర్సిరెడ్డి అన్నారు. ఇటీవల రిజిస్ట్రేషన్స్ శాఖలో చేపట్టిన మార్పుల కారణంగా ఏర్పడిన ఇబ్బందులపై శుక్రవారం పెదకాకాని రిజిస్ట్రార్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసనలో నర్సిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖల్లో సమన్వయ లోపం లబ్ధిదారులకు శాపంగా మారిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0 విధానం వలన, లబ్ధిదారులకు, దస్తావేజు లేఖర్లకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఆధార్ ఓటీపీలు లబ్ధిదారులు చెప్పడం లేదని, రిజిస్ట్రేషన్ దస్తావేజులో కొనుగోలుదారు పేరు విజయ్ అని ఉంటే మ్యుటేషన్ 1బీ అడంగల్‌లో విజయ అని వస్తుందని, తప్పుగా వచ్చిన పేర్లు మార్చడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సివస్తుందన్నారు. సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్దాలని కోరారు. మండల స్టాంప్ రైటర్లు పాల్గొన్నారు.